

అమెరి'కా'లేజ్

- లిపి మల్లాది



అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..

- సంపాదకుడు

(కిందటి సంచికనుండి కొనసాగింపు)

నేను లైబ్రరీలో జయలలిత గురించి పుస్తకాలు స్క్రీన్‌లో వెతకడం మొదలు పెట్టాను. దురదృష్టవశాత్తు సినిమా సంబంధించిన ఒక పుస్తకం తప్ప ఏమీ కనబడలేదు. లైబ్రరీ కంప్యూటర్‌లో లాగిన్ అయ్యి జయలలిత వంటివారు ఇంకెవరైనా ఉన్నారా అని గూగుల్‌ని అడిగాను.

ఇందిరాగాంధీ, మార్గరెట్ థాచర్, గోల్డా మియర్ పేర్లు వచ్చాయి. వారి గురించి పుస్తకాలు వెతికాను. వారి గురించి రాసిన కొన్ని పుస్తకాలతోపాటు జవహర్‌లాల్ నెహ్రూ రాసిన ఆటో బయోగ్రఫీ తీసుకుని రూముకి వెళ్ళాను. లైబ్రరీ నుండి తీసుకున్న పుస్తకాలు చాలానే పేరుకు పోవడంతో వచ్చే రెండు వారాలు క్లాసులు మొదలయ్యేలోగా ఇవి చదివేయాలని కంకణం కట్టుకున్నాను. ఇదివరకు మొదలు పెట్టిన ఫ్రిడా కాలో పుస్తకాన్ని తీసుకుని తిరగేయసాగాను. చీకటి పడడంతో సాయంత్రమైందని గ్రహించి వెన్నెల ఇంటికి వెళ్ళాను. తను సరిగ్గా అదే సమయానికి వచ్చింది.

"నా ఫోన్ మర్చిపోయాను" అన్నాను.

ఇద్దరం లోపలికి వెళ్ళి చూస్తే నా ఫోన్ లేదు. ఓ రెండు క్షణాలు గుండాగినంత పనైంది. వెన్నెల వెంటనే ఫోన్ చేసి ఇంటి బయటకి నడిచింది. తన కార్లోంచి వచ్చే వెలుగు చూసి అందులోంచి నా ఫోన్ తీసిన తరవాతే నేను ఊపిరి పీల్చుకున్నాను. నా ప్రెజంటేషన్ గురించి చెబుతూ నిన్న జయలలితలాగా మాట్లాడాను అంటే తెగ నవ్వింది వెన్నెల. ఆ తరవాత ఆటపట్టించడం మొదలు పెట్టి 'జయలలితగారు' అని పిలవసాగింది. నిన్నటిలానే ఇద్దరం కలిసి చపాతీ, పెరుగు, పచ్చడి, ఉల్లిపాయ తింటూ సిమీ గరేవల్ ఇంటర్వ్యూ మరొకటి విన్నాము.

ఈసారి రతన్ టాటాది. ఆయన నానమ్మ కోసం షికాగో నుండి ఇండియాకి వెళ్ళిపోవడం, ఇండియా ఎలా ఉంటుందో తెలియక తన గర్ల్‌ఫ్రెండ్ రాకపోవడంతో వంటరిగా ఉండిపోవడం ఆశ్చర్యంగా అనిపించింది. ఆ తరవాత కొన్నిసార్లు పెళ్ళి చేసుకుందామనుకున్నా జరగపోవడం వెన్నెలకి ఆశ్చర్యంగా అనిపించింది. ఇద్దరికి ఆశ్చర్యాన్ని, నవ్వుని తెప్పించింది.

సిమి ఆయన్ని ఆ వయసులో ఉండగా పెళ్ళి ఎప్పుడు చేసుకుంటారని అడగడం. దాదాపు అరవైయేళ్ళు ఉన్న ఆయన్ని పెళ్ళి గురించి అడగడం ఎంతో నవ్వు తెప్పించింది. ఆ తరవాత మరో ఇంటర్వ్యూలో రేఖని "నీ కుక్క పిల్లకి నీ పోలికలు ఉన్నాయి" అనడం మరింత నవ్వు తెప్పించింది. అలా వీడియోలు చూస్తూ చూస్తూ అర్ధరాత్రి అవ్వడంతో రాత్రి వెన్నెల ఇంట్లో ఉండిపోయాను.

మర్నాడు వెన్నెల ఆఫీసుకి వెళుతూ నన్ను దింపి, 'ఫోన్ ఉందికదా' అని అడిగి 'ఉంది' అన్నాక ఆఫీసుకి వెళ్ళిపోయింది.

ఇవాళ ప్రొఫెసర్ లాబ్‌లో అందరినీ మీటింగ్‌కి పిలిచారు. ఏమై ఉంటుందా అని అందరం చాలా ఆలోచించాము. "మే బీ హి ఈజ్ రిటైరింగ్" అని రెయిన్, "సెబాటికల్" అని సయ్యద్, "డీన్ అనౌన్స్‌మెంట్" అని స్టీఫెన్ అన్నారు. ముగ్గురు నా వంక చూడ్డంతో "మే బీ వెకేషన్" అన్నాను. ఆ మీటింగ్ వరకు అందరం అలానే కబుర్లు చెప్పుకున్నాము. చివరికి ఆయన చెప్పిన సంగతి ఒక పి.హెచ్.డి గ్రాడ్యుయేట్ స్టూడెంట్ రాసిన థీసిస్ జర్నల్‌లో సెలెక్ట్ అవ్వడంతో షికాగోలో ప్రెజెంట్ చెయ్యడానికి వెళుతున్నారని చెప్పారు. దాంతో చాలామంది చాలా ప్రశ్నలు అడిగారు.

"ఆర్ యు ప్రెజెంటింగ్? ఈజ్ హీ ప్రెజెంటింగ్"

"కెన్ ఐ సబ్మిట్ మై రిసర్చ్ పేపర్?", "ఈజ్ పిహెచ్‌డి ఎ రిక్వయిర్మెంట్", "హౌ టు అప్లై" అంటూ చాలామంది ప్రశ్నలు అడగడంతో నేను అడగడానికి ఏమీ మిగలలేదు. అయినా కూడా నన్ను చూసి "ఎనీ మోర్ క్వశ్చన్స్" అడిగారు.

లేదని తల అడ్డంగా ఊపాను. ఆయన వెళ్ళిపోగానే ఆ పిహెచ్‌డి స్టూడెంట్‌ని కొంతమంది కొన్ని ప్రశ్నలడిగారు, కొంతమంది కంగ్రాచులేషన్స్ చెప్పారు. నేను, రెయిన్ లాబ్‌కి వెళ్ళిపోయాము. నిన్న నేను, వెన్నెల చూసిన ఇంటర్వ్యూల

గురించి చెప్పి రేఖతో కుక్క పోలిక గురించి చెప్పిన వీడియోని చూపించాను. అది చూసేంత వరకు నమ్మలేదని అది చూసిన తరవాత రెయిన్ చెప్పింది. ఇద్దరం నవ్వుతూండగా ప్రొఫెసర్ లాబ్‌లోకి వచ్చారు. మేము పని చేయకుండా మాట్లాడుతున్నందుకు తిట్టుకుంటారేమో అని నేను భయపడ్డాను. ఆయన మమ్మల్ని చూసి ఎందుకు నవ్వుతున్నారని అడిగారు. నేను ఏం చెప్పాలో ఆలోచించే లోపల రెయిన్ నా ఫోన్‌లో ఆ వీడియో చూపించింది. ఆయన అది పేరడి అన్నారు.

"కాదు, నిజమైన ఇంటర్వ్యూ" అని రెయిన్ వివరించింది.

ఆయన నమ్మలేదు కాని చిన్నగా కాస్త నవ్వారు.

"ఎందుకు చూపించావు? నీకేమైనా పిచ్చా?" అడిగాను.

"వై. హి ఆస్క్డ్" అంది.

"మనం పని చెయ్యకుండా వీడియోస్ చూస్తున్నామని కోప్పడితే?" అడిగాను.

"ఆయన నవ్వారు" అంది.

నేను కోపంగా ఉండడం గమనించి "ఇట్స్ డిఫరెంట్ హియర్. ప్రొఫెసర్స్ ఆర్ ఫ్రెండ్లీ అంది". దాంతో నాకు చిన్న కల్చర్ షాక్ కలిగింది. ఆయన వెళ్ళిపోయాక సయ్యద్‌కి జరిగింది చెప్పి ఆశ్చర్యపోయాను. మొదట్లో తను కూడా అలానే ఆశ్చర్యపోయాడని, ముఖ్యంగా ప్రొఫెసర్లని పేరుతో పిలవడం తనకి ఇబ్బందిగా అనిపించిందని చెప్పాడు. రెయిన్‌కి ప్రోజెన్ ఫుడ్ చూసి ఆశ్చర్యంగా అనిపించిందని చెప్పింది. వాల్‌మార్ట్‌లో వంద రకాల కోకోకోలాలు, రకరకాల పాలు, పెరుగు డబ్బాలు చూసి నేను ఆశ్చర్యపోయానని చెప్పాను. సయ్యద్‌కి రోడ్డుకి అటుపక్క నడపడం కష్టంగా అనిపించిందని చెప్పాడు. రెయిన్‌కి క్లాసులో పక్కన కూర్చున్న వాళ్ళని మార్కులు అడగకుండా ఉండడం కష్టంగా అనిపించేదని, ఇప్పటికీ పొరపాటున అడుగుతుందని భయం అని చెప్పింది. అందులో ఎందుకు భయం అని అడిగాను. ఇక్కడ మార్కులు కాన్ఫిడెన్షియల్. ఎవరినీ అడగకూడదు అని చెప్పింది. ప్రొఫెసర్ మార్కులు ఎవరికీ చెప్పకూడదని తెలుసు కానీ అది కాన్ఫిడెన్షియల్ అని నాకు తెలియదు.

ఇప్పటివరకు ఎవరినైనా అడిగానా అని రెండు క్షణాలు ఆలోచించాను. ఇంతలో స్టీఫెన్‌ని ఎందుకు మీరు మార్కులు చెప్పుకోరు అని రెయిన్ అడిగింది. దానికి స్టీఫెన్ ఇచ్చిన జవాబు జోకనుకుని సయ్యద్ నవ్వడంతో నేనూ నవ్వాను. వాళ్ళు నవ్వకపోవడంతో నిజంగానే 'మెంటల్ హెల్త్' కోసం మార్కుల గురించి ఇక్కడ వారు మాట్లాడరని అర్థమైంది.

నేను, సయ్యద్ మనకి మార్కులు ఎంత ముఖ్యమో, మెంటల్ హెల్త్ ఎలా పట్టించుకోమో చెప్పాము. "బట్ మెంటల్ హెల్త్ ఈజ్ వెరీ ఇంపార్టెంట్, ఎస్పెషలీ ఫర్ గ్రోయింగ్ అప్" అన్నాడు.

"ఎడ్యుకేషన్ ఈజ్ మోర్ ఇంపార్టెంట్" అని సయ్యద్ అన్నాడు.

ఇద్దరూ చిన్న చర్చలోకి మునిగి గొడవ పడబోయేలా అనిపించడంతో నేను, రెయిన్ ఫోన్‌లో మెసేజ్ చేసుకుని "లంచ్ టైమ్ అయ్యింది. లెట్స్ గో" అన్నాము.

స్టీఫెన్ వెంటనే వెళ్ళిపోయాడు. సయ్యద్ కోపంగా అనిపించాడు. నేను, రెయిన్ నెమ్మదిగా సయ్యద్‌కి బై చెప్పి వెళ్ళిపోయాము. వాళ్ళిద్దరు ఎందుకంత దీర్ఘంగా చర్చించి గొడవపడబోయారని నాకు, రెయిన్‌కి అర్థంకాలేదు. లంచ్ చేసాక తనకి పని ఉందని పోస్ట్ ఆఫీస్‌కి వెళ్ళింది. నాకు లాబ్‌కి వెళ్ళాలనిపించక రూముకి వెళ్ళి పుస్తకం చదవసాగాను. పుస్తకం పూర్తయ్యేలోపు ఎంతో ఏడుపొచ్చింది. ఫ్రీడా కాలోకి చిన్నప్పుడు వచ్చిన పోలియో నుండి అనారోగ్యం మొదలైంది. స్కూల్లో ఉన్నప్పుడు జరిగిన బస్ ఏక్సిడెంట్ వల్ల సంవత్సరం పైనే మంచం మీద ఉంది. డాక్టరవ్వాలనుకున్న అమ్మాయి స్కూల్‌కి వెళ్ళలేక పెయింటర్ అవ్వాలనుకుంది. తిరిగి నడవగలిగాక తనకన్నా ఇరవై ఒక్కేళ్ళు పెద్దాయనని పెళ్ళిచేసుకుని అమెరికాకి వెళ్ళింది. తనకి అక్కడ నచ్చకపోవడం, భర్తకి వాళ్ళ దేశం నచ్చకపోవడంతో చాలా గొడవలుపడి కొన్నేళ్ళకి వివిధ కారణాలకి విడిపోయి, తిరిగి మళ్ళీ కలిసారు. ఆఖరి రోజుల్లో తన వెన్నుపూస కోసం గంటలపాటు ఇనపరాడ్ పట్టుకుని వేలాడడం, ముప్పై ఆపరేషన్లు చేయించుకోవడం, పోలియో వచ్చిన కాలిని తీసెయ్యడం వంటి క్షోభలన్నీ అనుభవించినా కూడా తన ఆఖరి గాలరీ ఎగ్జిబిషన్‌కి అంబులెన్స్‌లో వెళ్ళి అక్కడికి వచ్చిన వారందరితో మాట్లాడి, నవ్వించడంలో తనకి పెయింటింగ్ పట్ల ఉన్న ప్రేమ, అటువంటి పరిస్థితిలో కూడా అందరినీ నవ్వించే ఆత్మస్థైర్యం నన్ను ఎంతో కదిలించాయి. కొన్నిసార్లు 'హుందాగా ఉన్న నన్ను జనాలు ఎప్పటికీ హుందాగానే గుర్తుపెట్టుకోవాలి' అని ప్రజల్లోకి రాని వారు గొప్పగా అనిపిస్తే, శారీరకంగా ఎంతో కోల్పోయినా కూడా ప్రజల్లోకి వచ్చి ఆనందంగా కాలం గడపగలిగిన ఫ్రీడా కాలో మరింత గొప్పగా అనిపించింది. ఆఖరి రోజులు ఆవిడ భర్త తనకి దూరంగా ఉండడం, వంటరిగా ఉండలేక తెలిసిన వారందరినీ తన ఇంటికి పిలవడం, ఆఖరికి వంటరిగానే చనిపోవడం చదివి హృదయం ద్రవించిపోయింది. వద్దనుకున్నా నా ప్రమేయం లేకుండా ఏడుపు ఆపుకోలేక అలానే నిద్రపోయాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS